## ఏఈవోపై దాడి కేసులో నలుగురిపై కేసు

కుభీర్, జనవరి 21 ః నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని ఫకీర్‌నాయక్ తండాలో రైతు భరోసా పథకంలో భాగంగా సర్వే చేసేందుకు వెళ్లిన ఏఈవో జగదీశ్‌పై అదే గ్రామానికి చెందిన రాథోడ్ సుధాం, రమేశ్ జాదవ్, ఆడే కరణ్‌సింగ్, జాదవ్ గోవింద్‌లు దాడికి పాల్పడ్డారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. గ్రామం లోపలకు వెళ్తున్న ఏఈవోను లోపలికి వెళ్లనీయకుండా మందిరం వద్దనే అటకాయించి గల్ల పట్టి మా భూమికి సంబంధించిన సర్వే నంబరులో సాగు కావడం లేదని నమోదు చేస్తే చంపేస్తామని బెదిరించినట్లు బాధిత ప్రభుత్వ ఉద్యోగి ఏఈవో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై సోమవారం విధులకు ఆటంకం కలిగించడంతో పాటు చంపేస్తామని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పాఠశాలలో క్రీడా పోటీలు

జైనథ్, జనవరి 21 : మండలంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించారు. మేడిగూడ కెనాల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సోమ సంజీవ్‌రెడ్డి, హెచ్‌ఎం శరత్ కుమార్ యాదవ్‌తో కలిసి విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్, లక్ష్మణ్, దుస గంగన్న, పెంటపర్తి ఊశన్న, మూనాహిద్, అనుసూయ, పోచ్చిరాం, మేడిగూడ కెనాల్ ఉపాధ్యాయులున్నారు.

## వృద్ధుడి అదృశ్యం

బోథ్, జనవరి 21: బోథ్‌కు చెందిన వృద్ధుడు బెంబరి బాపు (77) అదృశ్యమైనట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంబరి బాపు ఈనెల 20న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. తెలుపు రంగు కమీజు, తెలుపు రంగు ధోతి, తెలుపు రంగు టవాల్ వేసి ఉన్నాడని పేర్కొన్నారు. కొడుకు బెంబరి భీమేశ్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు

కడెం, జనవరి 21: మండలకేంద్రంలో నిర్వహించిన నాలుగు మండలాల క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. కేపీకేడీ సీజన్1 మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా, 11 టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. పోటీలకు కడెం ఎస్ఐ కృష్ణ సాగర్‌రెడ్డి, బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీశ్ రాథోడ్ హాజరై ఇరు జట్లకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలను అందజేసి, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సన్మానించారు.

## తెలంగాణ హస్తకళ చైర్మన్‌కు ఘన స్వాగతం

నర్సాపూర్ (జీ), జనవరి, 21 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పనున్న స్కిల్ యూనివర్సిటీ ప్రాధాన్యతలో భాగంగా నిర్మల్ కొయ్యబొమ్మల కేంద్రాన్ని సందర్శించిన తెలంగాణ హస్త కళ చైర్మన్ నాయుడు సత్యనారాయణకు మంగళవారం సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, ఇతర శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఇక్కడ టీఎన్‌జీవో అధ్యక్షులు ప్రభాకర్, టీఎన్‌జీవో గడ్డం శ్రీనివాస్, సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులున్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

భైంసా, జనవరి, 21: పట్టణంలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటు హక్కు ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ బుచ్చయ్య, అధ్యాపకులు భీంరావు, రాజు, ఓం ప్రకాశ్, సురేందర్, రాజయ్య, కిషన్, తదితరులున్నారు.

# గ్రామ సభల్లో గందరగోళం

- జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజల ఆగ్రహం
- ఎక్కడికక్కడ అధికారుల నిలదీత



తాంసి: హస్నాపూర్ ప్రజాపాలనలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతు స్వామి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న నాలుగు కొత్త పథకాల కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో గందరగోళనం నెలకొన్నది. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. అలాగే ₹2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తరు? రైతుభరోసా ఇంకెప్పుడు ఇస్తారంటూ.. రైతులు నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేసి.. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తాంసి, జనవరి 21 : మండలంలోని అంబుగాంలో రైతులు రైతు భరోసా, రుణమాఫీ కాలేదని అధికారులను నిలదీశారు. గ్రామంలో మొత్తం 522 మంది రైతులకు 110 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హస్నాపూర్ గ్రామంలో రైతులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం రూ.12 వేలు ఇస్తామనడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఇక్కడ ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, మాజీ సర్పంచులు, నాయకులున్నారు.

బోథ్, జనవరి 21: సంక్షేమ పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని బోథ్ మండలంలోని కన్నుగుట్టలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తాము ఇది వరకే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నామని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినా కొంత మంది పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని మాకు వస్తాయా రావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి వాగ్వాదాన్ని సద్దుమణించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి నారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, ఏఈవో కృష్ణ, టీఏ నరేశ్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, జనవరి 21 : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల అధికారుల సమక్షంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో గందరగోళం నెలకొంది. సంబంధిత అర్హులైన లబ్ధిదారుల పేర్లు లిస్టులో రాలేదని ఆందోళన చేశారు. గ్రామసభలో అర్హులందరికీ రేషన్ కార్డు రాలేదని, ఆత్మీయ భరోసా పథకం కింద ఇచ్చిన పేర్లలో ఇంటి పేర్లు, ఆధార్ నెంబర్లు, ఫోన్ నంబర్లు పూర్తి స్థాయిలో లేకపోవడం దానికి సంబంధించిన వివరాలను అధికారులు బయటకి ఇవ్వకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. పోలీసులు కలుగజేసుకొని గొడవను సద్దుమణించారు. గ్రామ సభకు ముందుగా ఏర్పాటు చేయాల్సిన ఆత్మీయ భరోసా లిస్టును సభ ముగిసిన తర్వాత అతికించారు. దీంతో ఆత్మీయ భరోసా లిస్ట్ పైన ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహన్ సింగ్, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో మ హేందర్ రెడ్డి, వ్యవసాయాధికారి, విస్తీర్ణాధికారి సంతోష్, కార్యదర్శి సునీల్‌రెడ్డి, నాయకులున్నారు.

కడెం, జనవరి 21: మండలంలోని బెల్లాల్ గ్రామంలో జరిగిన గ్రామసభలో ప్రజలు, అధికారులకు వాగ్వాదం జరిగింది. గతంలో ఇచ్చిన దరఖాస్తులుండగా, మళ్లీ దరఖాస్తులు ఎందుకు అడుగుతున్నారని ప్రజలు అధికారులతో గొడవ పడ్డారు. అయితే చాలా మందికి అర్హత ఉన్నవారికి లిస్ట్‌లో పేర్లు రాలేదని, రేషన్‌కార్డు కోసం గతంలో తాము దరఖాస్తు చేసినప్పటికి నూతనంగా వచ్చిన లిస్ట్‌లో తమ పేర్లు లేవని మండిపడ్డారు. కేవలం దరఖాస్తులు తీసుకోవడం తప్ప ప్రజలకు ఎలాంటి లబ్ధిచేకూర్చడం లేదని ప్రజలంతా మండిపడ్డారు. బెల్లాల్‌తో పాటు, పలు గ్రామాల్లో స్వల్పంగా అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం జరిగింది.

సోన్, జనవరి 21 : సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో గ్రామసభ రసాభాసగా మారింది. సభలో కార్యదర్శి సమయ తస్కిన్ ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని అధికారులను నిలదీశారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారి గోవింద్, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీవో కలీం తదితరులున్నారు.

ముథోల్, జనవరి, 21: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. గతంలో అధికారులు రేషన్ కార్డుల సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాని గ్రామసభలో మాత్రం రేషన్ కార్డుకు అర్హత ఉన్నవారి పేర్లు రాకపోవడంతో సర్వే చేసి లాభమేమిటని అధికారులను ప్రజలు ప్రశ్నించారు. ఉత్తుత్తి సర్వేలు చేసి అర్హులను మోసం చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలలో ఇష్టారీతిన ఎంపిక చేసినట్లు ఆరోపించారు. ఎస్ఐ సంజీవ్ మహిళలను సముదాయించారు.



బోథ్ : కన్నుగుట్టలో గ్రామసభలో గ్రామస్తులను సముదాయిస్తున్న ఎస్ఐ, పోలీసులు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 21 : నిరంతరం ప్రజా పాలన కొనసాగుతుందని ట్రైని కలెక్టర్ అభిగ్యాస్ మాలవీయ అన్నారు. మండలంలోని కొండాపూర్, సిరికొండ, రాంపూర్(బీ), జెండాగూడ గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండలో 86 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో పేరు రావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. చాలా మంది అర్హులున్నారని వారి పేరు కూడా జాబితాలో చేర్చాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, ఏపీవో భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, జనవరి 21: మండలంలోని మల్లకచించోలి గ్రామంలో రేషన్‌కార్డులు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ శ్రీదేవి గ్రామసభలో వచ్చి రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కుభీర్, జనవరి 21 : మండలంలోని రాంనాయక్ తండాలో 170 మంది దరఖాస్తు చేసుకుంటే 17 మందికి రేషన్ కార్డులు మంజూరు కావడంపై గిరిజనులు అధికారులపై మండిపడ్డారు. 460 మంది ఈజీఎస్ కూలీలుంటే 168 మంది కూలీలకు రైతు ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేయడంపై అధికారులను నిలదీశారు. అన్ని గ్రామాలలో దరఖాస్తు చేసుకున్న వారిలో పది పదిహేను శాతం కూడా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంపై మండిపడ్డారు. దీంతో అధికారులు గ్రామ సభల్లో కార్డుల్లో చేర్పులు, కొత్త రేషన్ కార్డులకోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పండిపడ్డారు. ఎన్నిమార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు చెత్త బుట్టలో పడేశారా.. అంటూ మండిపడ్డారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారి శంకర్, గ్రామ ప్రత్యేకాధికారులు నవనీత్‌కుమార్, మోహన్‌సింగ్, అశోక్ కుమార్ తదితరులున్నారు.

## పాడి పశువులకు వసతులు కల్పించండి

దిలావర్‌పూర్ జనవరి 21 : తమ గ్రామంలో పాడిపశువుల కోసం వసతులు కల్పించాలని కోరుతూ మండలంలోని సముందర్‌పల్లి గ్రామాల రైతులు, నాయకులు అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్‌కు వినతి పత్రం అందించారు. మంగళవారం గ్రామంలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాన్ని అదనపు కలెక్టర్ విజయడైరీ అధికారులతో కలిసి పరిశీలించారు. రోజుకు 200 లీటర్లకు పైగా పాలను విజయ డెయిరీకి అందిస్తున్న రైతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ మధుసూదన్, పాలమిత్ర సాయి, మాజీ సర్పంచులు, పీరాజీపటేల్, భాగ్యరావు, పాడి రైతులున్నారు.

## బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

కడెం, జనవరి 21: మండలంలోని పాండ్వాపూర్ గ్రామానికి చెందిన మల్లపెల్లి భూమన్న తన ద్విచక్ర వాహనం పైనుంచి పడి మృతి చెందాడని కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం, భూమన్న తన భార్యను చూడడానికి ఉట్నూర్ మండలంలోని సాలెవాడకు బైక్‌పై వెళ్తుండగా కడెం మండలంలోని ఉడుంపూర్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో భూమన్న తలకు తీవ్రగాయాలు కాగా నిర్మల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స నిమిత్తం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. భూమన్న తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఏరియా దవాఖానను సందర్శన

భైంసా, జనవరి, 21: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను డీసీహెచ్ సురేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులను పరిశీలించి నార్మల్ డెలివరీలు పెంచేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఈయన వెంట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ కాశీనాథ్, సిబ్బంది తదితరులున్నారు.

## లభ్యమైన కంప్యూటర్లు

ఖానాపూర్ రూరల్, జనవరి 21 : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దొంగిలించిన కంప్యూటర్లు గ్రామ శివారులో లభ్యమయ్యాయి. ఈ నెల 18న చోరీకి గురైన కంప్యూటర్లు గ్రామశివారులో కనిపించడంతో పోలీసులు ఘటనా స్థలంలోకి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. కేసును విచారణ చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ రాహుల్ తెలిపారు.

## బాధితులకు పరామర్శ

ఎదులాపురం/ఇచ్చోడ (సిరికొండ), జనవరి 21 : నార్నూర్ ఘాట్ వద్ద జరిగిన ఐచర్ బోల్తాపడిన ఘటనలో గాయపడి క్షతగాత్రులను రిమ్స్‌లో మంగళవారం సిరికొండ మండలంలోని రాయిగూడకు చెందిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలదేవి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మాజీ సర్పంచ్ లింగు తండ్రి కుమ్రం మల్కు, తొడసం నాగు మృతి చెదడంపై సంతాపం ప్రకటించారు. ఆమె వెంట నాయకులు లక్ష్మణ్ ఉన్నారు.

## ఉట్నూర్ ఏఎస్పీకి సన్మానం

ఉట్నూర్, జనవరి 21 : ఉట్నూర్ ఏఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కాజల్‌ను మంగళవారం ఆమె కార్యాలయంలో హస్నాపూర్ గ్రామ పెద్ద రిటైర్డ్ టీచర్ జాదవ్ శంకర్‌రావు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అజయ్, రమేశ్, గణేశ్, వసంత్, హస్నాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఉపాధ్యాయుడి విరాళం

నేరడిగొండ, జనవరి 21 : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తేజాపూర్‌లో హింది ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెండి కిషోర్ కుమార్ పాఠశాల అభివృద్ధి కోసం రూ.60 వేలు విరాళం అందించాడు. స్వంత ఖర్చులతో పాఠశాల వేదికపై షెడ్డు నిర్మాణం చేయించాడు. పాఠశాలలో మహనీయుల చిత్రపటాలను ఏర్పాటుకు నిధులు ఖర్చు చేశాడు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలు మణిలత, ఉపాధ్యాయులున్నారు.

## బాల్య వివాహ రహిత జిల్లాకు కృషి

ఎదులాపురం, జనవరి 21 : బాల్య వివాహ రహిత భారతదేశం ప్రచారాన్ని అమలు చేయడంతోపాటు ఆదిలాబాద్ జిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చడానికి కృషి చేస్తామని షుర్ ఎన్జీవో డైరెక్టర్ జి.గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నీతి ఆయోగ్‌కు (అసోసియేషన్ ఫర్ వలంటరీ యాక్షన్) ఏవీఏ భాగస్వామ్యం అయిందని తెలిపారు. జిల్లాలో బాలల రక్షణ వ్యవస్థాగత యంత్రాంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. అలాగే పిల్లలకు సురక్షితమైన వాతావరణంలో అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయని వారికి కోసం షుర్ ఎన్జీవో ముందుంటుందన్నారు.

## శివాజీ మహారాజ్ విగ్రహానికి విరాళం

బేల, జనవరి 21 : మండలంలోని పోనాలలో ప్రతిష్ఠించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కోసం అడానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ సతీశ్ పవార్ రూ.11 వేలు విరాళాన్ని మంగళవారం కార్యాలయంలో గ్రామ పెద్దలకు అందజేశారు. ఇక్కడ పోనాల గ్రామ పెద్దలు ప్రమోద్ రెడ్డి, విట్టల్ గోడె, మగ్గిడి ప్రకాష్, కళ్లెం వెంకట్ రెడ్డి, పుల్మరే అశోక్, పోయాం అనిల్, వామన్ భోయార్, రౌత్ గజానన్, గవండే ప్రకాశ్ ఉన్నారు.

## ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి ఒకరి మృతి

సోన్, జనవరి 21 : సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన పోతుగంటి చిన్న గంగారాం (52) తోటలోకి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు సరస్వతి కెనాల్‌లో పడి మృతి చెందినట్లు ఎస్ఐ కే గోపి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం సాయంత్రం తన తోటలో కరెంటు మోటర్ ఆఫ్ చేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి తన బైక్‌పై వస్తుండగా అడవి పంది అడ్డు రావడంతో గంగారాం మోటారు సైకిల్‌తోపాటు సరస్వతి కెనాల్ నీటిలోపడి మునిగిపోయాడు. మంగళవారం ఉదయం నీటిపై తేలుతూ శవం కనిపించింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కొనసాగుతున్న ఆర్టిజన్ల దీక్ష



దీక్షలో కూర్చున్న ఆర్టిజన్లు

నిర్మల్ అర్బన్, జనవరి 21 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆర్టిజన్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మధు, కృష్ణ, వసీం, పోశెట్టి, మధు తదితరులున్నారు.

## మల్టీలెవల్ మార్కెటింగ్ ప్రచారాలు నమ్మవద్దు

ఎదులాపురం, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మల్టీలెవెల్-మార్కెటింగ్ ద్వారా ఎక్కువ మొత్తంలో లాభాలు పొందవచ్చని జరిగే ప్రచారాలను నమ్మవద్దని ఆదిలాబాద్ అదనపు ఎస్పీ ఆపరేషన్స్ బీ సురేంద్రరావు సూచించారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ద్వారా క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాలు వంటి వాటిపైన పెట్టుబడి పెట్టడం ద్వారా ఎక్కువ మొత్తంలో పొందవచ్చు అనే ప్రచారం ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలని ఆకర్షిస్తున్నారన్నారు. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం జరిగినప్పుడు ఆదిలాబాద్ పోలీస్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## నాలుగు పథకాలపై గ్రామ సభలు



భైంసా : పథకాల లబ్ధిదారులను ప్రకటిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్ నెట్‌వర్క్, జనవరి 21: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు,నూతన ఆహార భద్రత కార్డులు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలపై సభలు నిర్వహించారు. ఈ పథకాల్లో వచ్చిన పేర్లను పంచాయతీల్లో ప్రదర్శించారు. అర్హులైన లబ్ధిదారుల పేర్లు జాబితాలో రాకపోవడంతో దరఖాస్తులు చేస్తుకున్నారు. ఆయాశాఖల ప్రత్యేకాధికారులు,పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ పథకాలు మంజూరైన లబ్ధిదారుల పేర్లను అధికారులు గ్రామసభలో చదవి వినిపించి ఆమోదించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డు లిస్టులలో పేర్లు లేకపోవడంపై ఆశావాహులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ఇది ఫైనల్ కాదని మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తులు స్వీకరించారు. సమావేశాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావ్



క్యారం ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావ్

ఎదులాపురం, జనవరి 21 : వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడిల నుంచి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయని, మానసికోల్లాసాన్ని కలిగించి మరింత ఉత్సాహంగా పనిచేసే శక్తిని అందిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం క్రీడపోటీలను ప్రారంభించారు. న్యాయమూర్తులు క్యారం ఆడి న్యాయవాదులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీళ జైన్, హుస్సేన్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బీ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు

కడెం, జనవరి 21: కడెం మండలకేంద్రంలో నిర్వహించిన నాలుగు మండలాల క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. కేపీకేడీ సీజన్-1 మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా, 11 టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. ముగింపు పోటీలకు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి, బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీశ్‌రాథోడ్ హాజరై ఇరు జట్లకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలను అందజేసి, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ రాజర్షి షా



ఇంద్రవెల్లి : పిప్రి సభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులందరికీ అందుతాయని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని సమక, పిప్రి, ఉమ్రి గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. సభలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తం, ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షే పథకాల అమలు నిరంతర ప్రక్రియ : కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి,21: సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. నిర్మల్ పట్టణంలోని నాయుడువాడ, నిర్మల్ మండలంలోని న్యూపోచంపాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్డు సభల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆమె గ్రామస్తులకు వివరించారు. ఇక్కడ ఆర్డీవో రత్న కల్యాణి, డీఎస్వో కిరణ్‌కుమార్, తహసీల్దార్లు, అధికారులున్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 21 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మొత్తం 9127 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడం జరిగిందని ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మధ్యంతర సన్నద్ధ పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈనెల చివరి నాటికి సెలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని, పాఠాలను సులభంగా గుర్తించుకునే విధంగా మెలకువలను నేర్పించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ పి.రామారావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, అంబాజీ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లు పద్మ, సలోమి కరుణ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోన్, జనవరి 21 : సోన్ మండల కేంద్రంతోపాటు మాదాపూర్, పాక్‌పట్ల, గాంధీనగర్, సిద్దులకుంట, లోకల్ వెల్మల్, ముజ్గి, వెంగ్వాపేట్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇక్కడ నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు జమాల్, మారె గంగారెడ్డి, హరీశ్‌రెడ్డి, రావుల రాంనాథ్, డాక్టర్ నరేశ్, రమేశ్‌రెడ్డి, తదితరులున్నారు.

## నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలి

ఉట్నూర్, జనవరి 21 : జీసీసీ ద్వారా ఐటీడీఏ పరిదిలోని గిరిజన ఆశ్రమాలకు నాణ్యమైన నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక్ తిరుపతి అన్నారు. మంగళవారం సాయంత్రం జీసీసీ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించడంతో పాటు గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం రామానందం, సిబ్బంది ఉన్నారు.

# సూర్యనగర్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి తప్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్, జనవరి 21 : మండలంలోని సాకేర గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యనగర్ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామంలో గిరిజన 120 కుటుంబాలు, హరిజన 40 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. 520 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో దరావత్ గుండేరావ్, జాదవ్ గోపాల్, దరావత్ రమేశ్, జాదవ్ గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs
★అర్జెంట్‌గా మూతపడ్డ సర్ సిల్క్ కంపెనీకి వాచ్‌మెన్లు మరియు సూపర్ వైజర్స్ మరియు ఫ్యాక్టరీ ఇన్‌చార్జ్‌లు కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ కాగజ్ నగర్ 12 గంటల డ్యూటీ జీతం 8000/- ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. సంప్రదించండి: 9440050036, 7569783139, 9000711050.
NT-329004
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% అదనము
91827 77676, 91827 77679
91827 77671, 91827 77677